# సాక్షి ఖమ్మం

బుధవారం । 23 । ఏప్రిల్ । 2025


గరిష్టం / కనిష్టం
41° / 24°

**వాతావరణం**
జిల్లాలో బుధవారం ఎండకు తోడు వడగాలుల ప్రభావం ఉంటుంది. ఉదయం ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది.

# ఇంటర్ ఫలితాలు పైపైకి..

**గతంతో పోలిస్తే పెరిగిన జిల్లా ఉత్తీర్ణత శాతం**

- ప్రథమ సంవత్సరంలో 71.15, సెకండియర్‌లో 77.69శాతం ఉత్తీర్ణత
- రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన పలువురు
- ఎప్పటిలాగే సత్తా చాటిన బాలికలు







**ఇంటర్మీడియట్** ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. ఇంటర్మీడియట్ బోర్డు మంగళవారం ఫలితాలను విడుదల చేయగా.. మొదటి సంవత్సరంలో జిల్లాకు మూడో స్థానం, ద్వితీయ సంవత్సరంలో ఐదో స్థానం లభించింది. గత ఏడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం పెరగడమే కాక జిల్లా విద్యార్థులు పలువురు రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించడం విశేషం.

– ఖమ్మంసహకారనగర్

**ఫలితాలు ఇలా...**

ప్రథమ సంవత్సరం పరీక్షలకు హాజరైన 15,584మందిలో 11,088మంది ఉత్తీర్ణత సాధించగా 71.15శాతంగా నమోదైంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 14,876 మంది పరీక్షలు రాయగా 11,557 మంది ఉత్తీర్ణతతో 77.69 శాతం ఫలితాలు వచ్చాయి. ఒకేషనల్ విభాగం ప్రథమ సంవత్సరంలో 2,253 మందికి 1,388 మంది(61.61 శాతం), ద్వితీయ సంవత్సరంలో 2,043 మందికి 1,439 మంది(70.44శాతం) ఉత్తీర్ణత సాధించారు. గతేడాది ఫస్టియర్ ఫలితాల్లో జిల్లాకు రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానం దక్కగా ఈసారి మూడో స్థానానికి ఎగబాకింది. ఇక ద్వితీయ సంవత్సరంలో మాత్రం గత ఏడాది మాదిరిగా ఐదో స్థానమే దక్కింది.

**బాలికలదే హవా**

ప్రథమ సంవత్సరం పరీక్షలకు బాలురు 7,851 మంది హాజరు కాగా 5,065 మంది(64.51శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 7,733మందికి గాను 6,023మంది(77.89 శాతం) ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో బాలురు 7,346 మందికి 5,297 మంది(72.10శాతం), బాలికలు 7,530మందికి గాను 6,260 మంది(83.13శాతం) ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్‌తో పాటు ఒకేషనల్ విభాగాల్లోనూ బాలికలదే పైచేయిగా నిలిచింది.

**ప్రైవేట్ కళాశాలల హవా**

ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో అత్యధికంగా 994, 992తో పాటు 980కిపైగా మార్కులు పలువురు విద్యార్థులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 468మార్కులు పలువురు విద్యార్థులు సాధించటం విశేషం. బైపీసీ, ఇతర గ్రూపుల్లోనే ఇదే పరిస్థితి కనిపించింది.

### 30లోగా పరీక్ష ఫీజు చెల్లించండి

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం ఈనెల 30వ తేదీలోగా ఫీజు చెల్లించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు సూచించారు. రీ వెరిఫికేషన్ కోసం ప్రతీ పేపర్‌కు రూ.600, రీ కౌంటింగ్‌కైతే పేపర్‌కు రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. tg. cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. మార్కులు తక్కువగా వచ్చిన, ఫెయిల్ అయిన విద్యార్థులు ఆందోళన చెందకుండా అడ్వాన్స్ సప్లిమెంటరీకి సిద్ధం కావాలని సూచించారు.

**ప్రథమ సంవత్సరం ఫలితాలు**

| సంవత్సరం | విద్యార్థులు | ఉత్తీర్ణులైన వారు | శాతం |
|---|---|---|---|
| 2020 | 15,558 | 10,383 | 66 |
| 2022 | 14,274 | 9,869 | 69 |
| 2023 | 15,450 | 10,456 | 67 |
| 2024 | 16,015 | 10,224 | 63.84 |
| 2025 | 15,584 | 11,088 | 71.15 |

**ద్వితీయ సంవత్సరం ఫలితాలు**

| సంవత్సరం | విద్యార్థులు | ఉత్తీర్ణులైన వారు | శాతం |
|---|---|---|---|
| 2020 | 15,549 | 10,666 | 68 |
| 2022 | 14,366 | 10,297 | 71 |
| 2023 | 13,339 | 9,964 | 74 |
| 2024 | 14,564 | 10,806 | 74.20 |
| 2025 | 14,876 | 11,557 | 77.69 |

**పెరిగిన ఉత్తీర్ణత శాతం**

ఈ ఏడాది మొత్తంగా చూస్తే ఫలితాలు మెరుగయ్యాయనే చెప్పాలి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత శాతం గతేడాది కంటే ఈ ఏడాది 3 – 8శాతం మేర పెరిగింది. అంతేకాక ఎక్కువ మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులు సాధించారు. గతంతో పోలిస్తే ఫలితాలు మెరుగవడంతో రాష్ట్రస్థాయిలో జిల్లాకు గుర్తింపు లభించినట్లయింది.

### సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడతా



మంచి మార్కులే లక్ష్యంగా శ్రద్ధగా చదివాను. సెకండియర్ ఎంపీసీలో 996 మార్కులతో రాష్ట్రస్థాయి టాపర్‌గా నిలవడం ఆనందంగా ఉంది. మా నాన్న లెక్చరర్, అమ్మ గృహిణి. సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడడమా లేదంటే సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో ఉన్నాను.

– ఐ.రష్మిత, ఎస్ఆర్ జూనియర్ కళాశాల, ఖమ్మం

### ఉన్నత స్థానానికి చేరాలని...



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 985మార్కులతో జిల్లా టాపర్‌గా నిలవడం సంతోషంగా ఉంది. మంచి కళాశాలలో ఇంజనీరింగ్ చేసి ఉన్నతస్థాయికి చేరాలనేది లక్ష్యం. అండగా నిలిచిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, డీఐఈఓ, ప్రిన్సిపాల్, అధ్యాపకులకు కృతజ్ఞతలు.

– జి.సాయినీరజ్, ఏఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఖమ్మం

### డాక్టర్ అవుతా..



ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బైపీపీలో 994మార్కులు సాధించడం ఆనందంగా ఉంది. భవిష్యత్‌లో శ్రద్ధగా చదివి మంచి డాక్టర్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నా. తద్వారా పేదలకు సేవ చేసే అవకాశం ఉండడంతో ఈ వృత్తిని ఎంచుకోవాలని భావిస్తున్నా.

– బి.జ్యోత్స్న, కృష్ణవేణి జూనియర్ కళాశాల, ఖమ్మం

# కల్లూరు ఇకపై మున్సిపాలిటీ

**అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు విడుదల**



కల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయం

**కల్లూరు:** కల్లూరు మేజర్ గ్రామపంచాయతీ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది. ఈమేరకు రాష్ట్ర గవర్నర్ ఆమోదంతో మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లాలో మేజర్ పంచాయతీగా ఉన్న కల్లూరును మున్సిపాలిటీగా మార్చాలని ఏళ్లుగా డిమాండ్ ఉంది. కొన్నాళ్ల క్రితం కల్లూరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి ఈ విషయాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తీసుకెళ్లారు. దీంతో ప్రజలంతా అంగీకరిస్తే మున్సిపల్‌గా మార్చే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం కల్లూరు మేజర్ పంచాయతీలో కల్లూరు, జీడీబీ పల్లి, ఖాన్‌ఖాన్‌పేట, శ్రీరామ్‌పురం ఉన్నాయి. ఇప్పుడు కప్పలబంధం, పుల్లయ్య బంజర్, తూర్పు లోకవరం, పడమర లోకవరం, కిష్టయ్య బంజర, హనుమాతండా, వాచ్యానాయక్ తండా గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేసేందుకు ఆయా పంచాయతీల్లో చేసిన తీర్మానాలను ప్రభుత్వానికి సమర్పించారు. దీంతో అసెంబ్లీలో ప్రతిపాదించగా, రాష్ట్ర గవర్నర్ ఆమోదంతో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే మట్టా రాగమయికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రశాంతంగా 'ఓపెన్' పరీక్షలు

**ఖమ్మంసహకారనగర్:** సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఈమేరకు మంగళవారం పదో తరగతి పరీక్షలకు 268మందిలో 232 మంది, ఇంటర్మీడియట్ పరీక్షలకు 747మందిలో 669 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా, పలు కేంద్రాలను రాష్ట్ర పరిశీలకుడు ఎస్.వి.దుర్గాప్రసాద్ తనిఖీ చేశాక కలెక్టరేట్‌లో డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మద్దినేని పాపారావుతో సమావేశమయ్యారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు, ఏసీజీఈ జి.రమేష్, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందం సభ్యులు కూడా పలు కేంద్రాల్లో తనిఖీ చేశారు.



# సివిల్స్‌లో మెరిసిన రత్నాలు

- రూ.32లక్షల వార్షిక వేతనం వదులుకున్న చరణ్ తేజకు 231వ ర్యాంక్
- 697వ ర్యాంకు సాధించిన గిరిజన యువకుడు నాగరాజు



తల్లిదండ్రులతో చరణ్ తేజ



**చింతకాని:** యూపీఎస్‌సీ మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో జిల్లా నుంచి ఇద్దరు యువకులు ర్యాంకులు సాధించారు. చింతకాని మండలం మత్కేపల్లికి చెందిన నర్సింశెట్టి చరణ్ తేజ 231వ ర్యాంక్ సాధించడం విశేషం. గ్రామానికి చెందిన నర్సింశెట్టి హరినాథ్‌బాబు – నాగమణి దంపతుల చిన్న కుమారుడు చరణ్ తేజ 10వ తరగతి వరకు హైదరాబాద్‌లోని నారాయణ కాన్సెప్ట్ స్కూల్‌లో, ఇంటర్ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో పూర్తిచేశాక జేఈఈలో 88వ ర్యాంకు సాధించి ముంబై ఐఐటీలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఆతర్వాత తొమ్మిది నెలల పాటు రూ.32 లక్షల వార్షిక వేతనంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసినా సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో ఉద్యోగం మానేశాడు.

**సొంతంగానే సిద్ధం..**

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేశాక చరణ్‌తేజ ఎలాంటి శిక్షణ తీసుకోకుండానే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న వనరుల ద్వారా సివిల్స్‌కు సిద్ధమయ్యాడు. 2022లో తొలిసారి పరీక్ష రాసినా ప్రిలిమ్స్‌కు అర్హత సాధించకపోగా 2023లో ఇంటర్వ్యూ దశకు చేరాడు. ఇక మూడో ప్రయత్నంలో ఈసారి ఆలిండియా 231వ ర్యాంక్ సాధించడం విశేషం. ఆయన తల్లిదండ్రులు 25ఏళ్ల క్రితమే హైదరాబాద్‌లో స్థిరపడగా తండ్రి హరినాథ్‌బాబు ప్రైవేట్ కంపెనీలో మెకానికల్ ఇంజనీర్‌గా, తల్లి నాగమణి మెదక్ జిల్లా నర్సాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. చరణ్ సోదరుడు జైశిక్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా చరణ్‌తేజతో 'సాక్షి' మాట్లాడగా సివిల్స్‌లో ఆప్షనల్‌గా గణితం ఎంచుకున్నట్లు వెల్లడించాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే సివిల్స్ సాధించానని, ఐఎఫ్ఎస్ ఎంచుకోవాలనే భావనతో ఉన్నట్లు తెలిపాడు.

## వ్యవసాయ కుటుంబం నుంచి 697వ ర్యాంకు



నాగరాజు నాయక్

**కల్లూరురూరల్:** కల్లూరు మండలం వాచ్యానాయక్ తండాకు చెందిన గిరిజన యువకుడు బానోత్ నాగరాజు నాయక్ సివిల్స్ ఫలితాల్లో మెరిశాడు. ఆయన ఆల్‌ఇండియా స్థాయిలో 697వ ర్యాంక్ సాధించాడు. నాగరాజు నాయక్ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కల్లూరులో, 6నుంచి 10వ తరగతి వరకు పాలేరులోని నవోదయ విద్యాలయంలో పూర్తిచేశాడు. ఆతర్వాత ఇంటర్‌మీడియట్ విజయవాడలోని శ్రీ చైతన్య కళాశాల, బీటెక్ హైదరాబాద్‌లోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాలలో పూర్తిచేశాడు. సివిల్స్‌లో సోషియాలజీ సబ్జెక్ట్ ఆప్షనల్‌గా తీసుకున్న నాగరాజు ఐదో ప్రయత్నంలో విజయం సాధించాడు. నాగరాజు తండ్రి పంతులు నాయక్ – తల్లి మారోని వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తూ ఇద్దరు కుమారులను చదివించారు. ప్రస్తుతం నాగరాజు సివిల్స్ సాధించగా.. ఆయన సోదరుడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం సివిల్స్ ప్రిలిమ్స్ దశ దాటిన వారికి ఇచ్చే రూ.లక్ష పారితోషికం అందుకున్న నాగరాజు సివిల్స్‌కు ఎంపికవడంపై స్థానికులతో పాటు పలువురు అభినందించారు.

# 'భూ భారతి'తో సమస్యలకు చెక్

**అవగాహన సదస్సులో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్**



ముదిగొండ : ధాన్యం తేమను పరీక్షిస్తున్న కలెక్టర్

**రఘునాథపాలెం:** రాష్ట్రప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో భూసంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. రఘునాథపాలెం రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, భూమి హద్దుల నిర్ధారణ, యాజమాన్య హక్కుల నిర్ణయం సులువవుతుందని చెప్పారు. సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, హక్కుదారులకు పట్టాల మంజూరు, నిషేధిత భూముల పరిశీలన చేపడుతామని తెలిపారు. ఆర్డీఓ జి.నర్సింహారావు, తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఏఓ ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు. కాగా, సర్వే ద్వారా కౌలు రైతులకు రక్షణ చట్టం అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి తదితరులు కలెక్టర్‌కు విన్నవించారు.

■ **ముదిగొండ:** ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపడుతూనే కాంటా కాగానే మిల్లులకు తరలించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. ముదిగొండ మండలం మేడేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడాక నిర్వాహకులకు సూచనలు చేశారు. తేమ, తరుగు విషయంలో అప్రమత్తంగా ఉండాలని, రైతులకు టార్పాలిన్లు, గన్నీబ్యాగ్‌లు సమకూర్చాలని చెప్పారు. తొలుత కేంద్రం వద్దకు చేరడానికి కలెక్టర్ బైక్‌పై వెళ్లారు. తహసీల్దార్ సునీత ఎలిజబెత్ పాల్గొన్నారు.

■ **ఖమ్మంవ్యవసాయం:** మధిర నియోజకవర్గంలో ఏర్పాటుచేస్తున్న ఇందిరా మహిళా డెయిరీ లబ్ధిదారులకు ప్రయోజనం కలిగేలా అధిక పాల దిగుబడి ఇచ్చే గేదెలనే పంపిణీ చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో డెయిరీ, సదరం క్యాంపులు, వితంతు పెన్షన్లపై అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, గిరిజన, బీసీ సంక్షేమ శాఖల బీసీలు విజయలక్ష్మి, జ్యోతి, డీపీఓ ఆశాలత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు, ఆర్డీవో రాజేందర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల్లో వేగం

**లోక్‌సభ సభ్యుడు రఘురాంరెడ్డి**



స్టేషన్‌లో పనులపై ఆరా తీస్తున్న ఎంపీ

**ఖమ్మం రాపర్తినగర్:** ఖమ్మం రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి, ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఆదేశించారు. పనులను మంగళవారం పరిశీలించిన ఆయన అధికారులతో సమీక్షించారు. మార్చికల్లా పూర్తవుతాయన్న పనులు ఇంకా జరుగుతుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.25 కోట్లతో నిర్మిస్తున్న వెయిటింగ్ హాల్, ఎస్కలేటర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ప్లాట్ ఫామ్‌పై షెడ్ల పనుల్లో వేగం పెంచి, ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆతర్వాత ఓ స్టాల్‌లో టీ తాగిన ఎంపీ 'చాయ్ అచ్ఛా హై..' అని నిర్వాహకులను అభినందించారు. ఖమ్మం కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జాఫర్, డిప్యూటీ స్టేషన్ మాస్టర్ అనిల్ కుమార్, ఆర్పీఎఫ్ సీఐ సురేష్ గౌడ్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కుమార్, ఎస్ఎస్‌సీ అధికారి అఖిల్, కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గప్రసాద్, ఎం.డీ.ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

**ఖమ్మంసహకారనగర్:** పేదల సొంతింటి కల నిజం చేసేలా అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడతలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మంగళవారం ఆయన సీఎస్ శాంతికుమారి తదితరులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతిపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఖమ్మం నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక, భూ భారతి అవగాహన సదస్సులపై సూచనలు చేశారు. జిల్లా నుంచి కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి సదస్సుల్లో ఇప్పటివరకు 1079 దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. ఆర్డీఓలు నర్సింహారావు, రాజేందర్, హౌసింగ్ పీడీ బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే



కలెక్టర్‌తో సమావేశమైన మధు, సండ్ర

**ఖమ్మంమయూరిసెంటర్:** కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మంగళవారం కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించడమే కాక సత్తుపల్లి నియోజకవర్గం ఇందిరమ్మ లబ్ధిదారులు జాబితాలో గృహలక్ష్మి లబ్ధిదారులకు అవకాశం కల్పించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 1638 సన్నరకం ధాన్యాన్ని కూడా సేకరించాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు కనగాల వెంకటరావు, మోహన్‌రావు, అశోక్, మల్లిదు వెంకన్న, ఆసిఫ్, పాషా పాల్గొన్నారు.

### 25న సకల ఉద్యోగుల ర్యాలీ, సదస్సు

**ఖమ్మంసహకారనగర్:** తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యాన ఈనెల 25నసాయంత్రం ఖమ్మం కలెక్టరేట్ నుండి టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు తెలిపారు. ఈమేరకు కరపత్రాలు, పోస్టర్లను యూటీఎఫ్ భవన్‌లో మంగళవారం ఆవిష్కరించాక మాట్లాడారు. ర్యాలీ అనంతరం టీఎన్జీవోస్ భవన్‌లో సదస్సు ఉంటుందని, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగమల్లేశ్వరరావు, వెంకన్న, రాంబాబు, ఉద్దండ్ షరీఫ్, సురేష్, నాగేశ్వరరావు, కేశ్యా, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### ట్రయల్ రన్ కోసం పాలేరు నీటి విడుదల

**కూసుమంచి:** మండలంలోని పాలేరు రిజర్వాయర్ నుండి ఎడమ కాల్వ ద్వారా మంగళవారం సాయంత్రం నీరు విడుదల చేశారు. పంటల సీజన్ ముగియగా కొద్దిరోజుల క్రితం నీటి సరఫరా పూర్తిగా నిలిపేశారు. అయితే, రఘునాథపాలెం మండలం మంచుకొండ వద్ద నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం ట్రయల్‌రన్ కోసం తిరిగి నీటిని విడుదల చేశారు. వేయి క్యూసెక్కుల నీటిని 24 గంటల పాటు విడుదల చేశాక నిలిపివేస్తామని అధికారులు తెలిపారు.

### బంక్‌ల్లో కనీస సౌకర్యాలు తప్పనిసరి

**నేలకొండపల్లి:** పెట్రోల్ బంక్‌ల్లో వినియోగదారులకు కనీస సౌకర్యాలు కల్పించకపోతే నిర్వాహకులకు చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ తెలిపారు. మండలంలోని తిరుమలాపురంలో పెట్రోల్ బంక్‌ను మంగళవారం తనిఖీ చేసిన ఆయన రికార్డులను పరిశీలించాక మాట్లాడారు. వినియోగదారులు తమ ఫిర్యాదులను బాక్స్‌ల్లో వేయాలని తెలిపారు. అనంతరం పలు గ్రామాల్లో రైస్ మిల్లులను తనిఖీ చేసిన డీఎస్‌ఓ.. రైతులతో మాట్లాడారు. సివిల్ సప్లయీస్ ఆర్‌ఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### యూడీఐడీకి 72మంది దివ్యాంగుల అర్హత

**ఖమ్మంవైద్యవిభాగం:** దివ్యాంగులకు యూనిక్ డిసేబులిటీ ఐడెంటిటీ కార్డు(యూడీఐడీ)లు జారీ చేసేందుకు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం శిబిరం నిర్వహించారు. స్లాట్ బుక్ చేసుకున్న 253మందిలో 149మంది హాజరుకాగా, పరీక్షల అనంతరం 72మంది దివ్యాంగులను కార్డులకు అర్హులుగా నిర్ధారించారు.

### స్తంభం పడి మేకలు మృతి

**కొణిజర్ల:** కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభం విరిగిపడడంతో రెండు మేకలు మృతి చెందాయి. మండలంలోని పల్లిపాడుకు చెందిన రాయల రుక్మిణి, ఆమె కుమారుడు కలిసి మేకలు మేపుతున్నారు. అదే ప్రాంతంలో 33 కేవీ లైన్ ఏర్పాటులో భాగంగా వేస్తున్న స్తంభాలు ఒకటి కూలి రెండు మేకలపై పడడంతో మృతి చెందాయి. ఘటనపై రుక్మిణి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# ఇంటర్‌లో సత్తా చాటిన విద్యార్థులు

## ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు

ఇంటర్‌మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. పలువురు విద్యార్థులు రాష్ట్రంలోనే అత్యధిక మార్కులతో ర్యాంకులు సాధించడం విశేషం. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయా కళాశాలల యాజమాన్యాలు అభినందించాయి.

– ఖమ్మం సహకారనగర్

### న్యూవిజన్ విజయదుందుభి



విద్యార్థులతో చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్లు కార్తీక్, గోపీచంద్

ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు విజయ దుందుభి మోగించారని న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్ తెలిపారు. జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు కె.నేహశ్రీ 468, ఎస్.సిరిసంజన 467, డి.శ్రీ జయదీప్‌కుమార్ 467, సీ.హెచ్.ఆదిత్య శ్రీవాత్సవ 467, కె.రూపిక 467, జి.రిషిక్‌తేజ 467, బి.శ్రీకరణ్ 467, ఎం.డీ.అస్లాం హంజా 467, టి.మన్విత తేజ 467, ఆర్.సిరిచందన 467, ఎం.గీతిక శ్రీ 467మార్కులు, బైపీసీలో 440 మార్కులకు ఎం.డీ.ఇనాస్ 436, టి. గోమతి 435, కె.గుణశేషు 434, బి.శశాంక్ 434 సాధించారన్నారు. అలాగే, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వెయ్యి మార్కులకు జి.లలనిక చౌదరి 993, జి.రిషిత 993, సీహెచ్.నిషిత 993, ఈ.వేదసంహిత 993, బైపీసీలో ఆర్.రూపశ్రీ 993, ఆర్.శీతల్ 992, పి.సంహిత 991 మార్కులు సాధించగా.. రాష్ట్ర స్థాయి మొదటి 10 ర్యాంకుల్లో తమ విద్యార్థులు నిలిచారని తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ సీహెచ్.కార్తీక్, డైరెక్టర్ గోపీచంద్, ప్రిన్సిపాళ్లు బ్రహ్మచారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### రెజొనెన్స్ ప్రభంజనం



విజయచిహ్నం చూపుతున్న డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు, విద్యార్థులు

రెజొనెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని డైరెక్టర్లు ఆర్.వీ.నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో డి.హారిక 466, తిరుపతమ్మ, వి.తన్మయి, టి.సరెగమ, బీవీఎస్.వర్షిత, ఎ.వర్షిణి, ఎం.విగ్నేష్ 466, షేక్ అనీఫా, ఎల్.రామ్మోహన్‌రెడ్డి, ఎం.మన్వితశ్రీ, ఎం.భవ్య, ఎస్.వివేక్, బి.చరిష్మ 465 మార్కులు, బైపీసీలో 440 మార్కులకు కె.హారిక 436 మార్కులు, జి.నిస్సిడెనీల, కె.అదితి 434, బి.దివ్యశ్రీ 432, సీహెచ్.ధన్యత 430, ఎం.ధరణి 428, షేక్ ఫర్హీన్ 427, శ్రీకళ 425, కె.వర్షిత 422 మార్కులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో బి.నిహారిక, ఎం.ప్రేమ్‌సాయి 992, ఎ.లహరి, రోహిణి 991, చరిష్మా, స్వామి సాయి కీర్తన్ 990, బైపీసీలో ఎస్.జాహ్నవి 989 మార్కులు, ఎ.జాహ్నవి 981, డి.ఉషశ్రీ 980, డి.హాసిని 973, సీహెచ్.మణికంఠ 972 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు వి.సతీష్, భాస్కర్‌రెడ్డి, శాంతి పాల్గొన్నారు.

### హార్వెస్ట్ విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి

హార్వెస్ట్ విద్యాసంస్థల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారని కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఎ.శ్రీకళ 467మార్కులు, ఏ.యామిని, జి.ప్రణతి, ఎం.సిరి శాన్వి, కె.రుచిత 466, జి.కౌసల్య, జి.పూజిత 465, జి.నమీత్, ఓ.అభిరామ చరణ్ 464, సెకండియర్ ఎంపీసీలో సీహెచ్.నిఖిత్, సీహెచ్.నివేదిత, పి.హారిణి 990మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఇంకా పి.వెంకటకౌశిక్ 985, సీహెచ్.జీవన తేజశ్రీ, కె.భువన్ 984, ఎస్.జాహ్నవి 981, ఎ.ప్రవిష్ట చౌదరి 980మార్కులు సాధించగా పలువురు అభినందించారు.

### శ్రీచైతన్య.. ప్రతిభ



విద్యార్థులతో చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులతో తమ విద్యార్థులు రికార్డు సృష్టించారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. సీనియర్ ఎంపీసీలో కె.మణికీర్తన, ఎస్.సాకేత్, కె.సాయి రూప తేజస్విని 994మార్కులు, ఏ.సాయితేజ, వి.భార్గవి, ఈ.కీర్తి, కె.తేజశ్రీ, ఎస్.విన్నెల 993మార్కులు, బైపీసీలో ఎం.డీ.సున్నైయా తబుస్సుమ్, పి.హారిణి 992మార్కులు, ఏ.జ్యోత్స్న, ఎం.మనీషా 991, వై.కావ్య 990, కె.సాయిజశ్వంత్, ఎం.డీ.సిద్రా, వి.లోరా, వి.ప్రియాంక, కె.కీర్తన, కె.హాసిని 988మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఎంపీసీలో టి.నాగతేజ, ఎం.నాగహాసిని, పి.మోక్షిత, ఎస్.నాగ స్వాతి, జి.భావన, బి.వర్షిత, జీరా మేహక్ 468మార్కులు, బైపీసీలో కె.జ్యోత్స్న, 438, జి.ధారా హాసిని, బి.శ్వేత, జి. విజయాంజలి, ఎస్.హర్షిత 437, ఎస్.ఆకాంక్ష, బి.అపూర్వ, జి.జాన్ వశిష్ఠ, డి.మాన్వి అక్షయ, బి.తేజస్విని, జి.రామతులసి, వి.ప్రసన్న 436మార్కులు సాధించారన్నారు. వివరాలను చైర్మన్, డైరెక్టర్ వెల్లడించగా, అకడమిక్ డైరెక్టర్ సాయి గీతిక, డీజీఎం చేతన్ మాథుర్, ఎగ్జిక్యూటివ్ డీన్ వర్మ, డీన్ కృష్ణ, జీజీఎంలు సిహెచ్.బ్రహ్మం, జి.ప్రకాష్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

### కృష్ణవేణి విద్యార్థుల సత్తా



విద్యార్థులతో డైరెక్టర్లు జగదీష్, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు

ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కృష్ణవేణి కళాశాల డైరెక్టర్లు గొల్లపుడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఏ.ప్రియాంబిక, ఎస్.సాయి సంజన, వై.స్ఫూర్తి 993, టి.చందాన 991, ఎస్.సంతోష్‌రెడ్డి, జూనియర్ ఎంపీసీలో ఆర్.భువన కృతి, బి.పవిత్ర 468, ఈ.హర్షిత్, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.సాయి సాత్విక, వి.రాజ్యలక్ష్మీ, ఎస్ఎస్.లక్ష్మి, కె.భరత్‌కుమార్, డి.భానురమ్య, ఎన్.చందన, వి.గణేష్, సిహెచ్.సౌమ్య శ్రీ, పి.హర్షవర్ధన్ 467మార్కులు సాధించారన్నారు. బైపీసీలో జి.ప్రహర్ష, ఎస్.కరుణ శ్రీ 437, సీహెచ్.ఇందిర, కె.అఖిల్ సాయి, ఎం.డీ.ఆయేషా 436, ఎంఈసీలో టి.సహస్ర లీల 491 మార్కులు, సీఈసీ విభాగంలో అత్యధికంగా 483మార్కులు వచ్చాయని తెలిపారు. ప్రిన్సిపాల్ గుర్రం రామచంద్రయ్య, అకడమిక్ డీన్ ఎల్లారి వంశీకృష్ణ, ఏఓ నిరంజన్‌కుమార్ పాల్గొన్నారు.

### స్టెమ్‌స్పార్క్.. అత్యుత్తమం



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు శ్రీధర్‌రావు, కృష్ణవేణి

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని స్టెమ్‌స్పార్క్ జూనియర్ కళాశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణి తెలిపారు. కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరంలోనే ఎంపీసీలో ఎ.హర్షిత 467 మార్కులు, సీహెచ్.హిమజ, పి.నాగసాయి అనిరుధ్ వర్మ 466, జి.గాయత్రి, సిహెచ్.సుషాంక్, వై.శ్రీరామ్ 465, బి.బ్రాహ్మణి 464మార్కులు సాధించగా, మిగతా వారు సైతం 400 నుంచి 450 మార్కులు సాధించారని వెల్లడించారు. విద్యార్థులను డైరెక్టర్లతో పాటు అధ్యాపకులు అభినందించారు.

### ఎస్ఆర్ విద్యార్థుల హవా




విద్యార్థులతో కళాశాల యజమాన్య బాధ్యులు

ఇంటర్ ఫలితాల్లో ఖమ్మంలోని ఎస్ఆర్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ మార్కులు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఇందూరి రశ్మిత 996 మార్కులతో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు సాధించిందని వెల్లడించారు. అలాగే, ఫస్టియర్ ఎంపీసీలో హాసిని, పశాంతిక రమ్య 468, సాత్విక్, తేజస్విని, రోహిణి, టి.తేజస్విని, ఉజ్వల, ప్రసన్నకుమారి, యామిని, వినిషా, అంకిత, సాయితేజ 467 మార్కులు, బైపీసీలో సాయిలక్ష్మి 435, శ్రావ్య, సుమేరా ముస్కాన్ 434, మేనక, శరణ్య, మేధ 433 మార్కులు సాధించారని తెలిపారు. సెకండియర్ ఎంపీసీలో వెంకటలక్ష్మి తేజస్విని 995, కావ్య 994, శ్రీ వర్షిత, అమూల్య, జశ్విత 993, బైపీసీలో కార్తీక 994 మార్కులు సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను చైర్మన్ వరదారెడ్డితో పాటు డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సీఈఓ సురేందర్‌రెడ్డి, డీజీఎం గోవర్ధన్ రెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ విజయభాస్కర్ రెడ్డి, డీన్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాళ్లు అశోక్, శ్రీనివాస్,"సుధాకర్, బ్రహ్మం, అధ్యాపకులు అభినందించారు.

### వెలాసిటీ.. విజయకేతనం



విద్యార్థులతో యజమాన్యం లక్ష్మణ్‌రావు, రవి, యాకూబ్ తదితరులు

వెలాసిటీ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించారని చైర్మన్ శెట్టి లక్ష్మణ్‌రావు, సెక్రటరీ, కరస్పాండెంట్ మల్లోలు రవి, అకడమిక్ డీన్ యాకూబ్ తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో బి.శృతి 470కి 468మార్కులు స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించగా, ఏ.రూప, పి.ఉభయ్ కృష్ణ 466, ఏ.సింధు 464, ఎస్.కే.పాషా 463మార్కులు సాధించారన్నారు. బైపీసీలో వి.చాందిని 434మార్కులు, సీఈసీలో ఆర్. శిరీష 475మార్కులు సాధించారని వెల్లడించగా.. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

## టీబీ బాధితులు పోషకాహారం తీసుకోవాలి



చిన్నారుల కంటి పరీక్షలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

**ఖమ్మంవైద్యవిభాగం:** టీబీ బాధితులు పోషకాహారం తీసుకుంటూ మందులు సక్రమంగా వాడాలని డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి సూచించారు. జిల్లా ఆస్పత్రిలోని క్షయ వ్యాధి నివారణ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించిన ఆమె మె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్షయ బాధితుల గుర్తింపు, చికిత్సపై సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే, బాధితులకు చికిత్సపై అవగాహన కల్పించారు. అనంతరం వాక్సినేషన్ రికార్డులు తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారి వరికూటి సుబ్బారావుతో పలు అంశాలపై సమీక్షించారు. అంతేకాక ప్రధాన ఆస్పత్రి ప్రాంగణంలోని తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్, పీపీ యూనిట్లలో కూడా డీఎంహెచ్‌ఓ తనిఖీ చేశారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, పాథాలజిస్ట్ డాక్టర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు. కాగా, గొల్లగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల కంటి పరీక్షల శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది డాక్టర్ రాధాకృష్ణ, అబ్దుల్ అలీం తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా సాయికుమార్



సాయికుమార్

**ఎర్రుపాలెం:** యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎర్రుపాలెం మండలం కండ్రికకు చెందిన వేజండ్ల సాయికుమార్ ఎన్నికయ్యారు. ఈమేరకు మంగళవారం ప్రకటన విడుదలైంది. నాలుగు నెలల క్రితం ఆన్‌లైన్ ద్వారా ఓటింగ్ నిర్వహించగా, సాయికుమార్‌కు 16వేల మేరకు ఓట్లు పోలయ్యాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, నాయకుల సమన్వయంతో యూత్ కాంగ్రెస్‌తో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

### పత్తి కొనుగోళ్లపై విజిలెన్స్ తనిఖీలు

**ఖమ్మంవ్యవసాయం:** కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా చేపట్టిన పత్తి కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయనే సమాచారంతో విజిలెన్స్ విభాగం అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. తాత్కాలిక రిజిస్ట్రేషన్ల జారీలో కొందరు ఉద్యోగులు అక్రమాలకు పాల్పడ్డారనే అంశంపై విచారణ జరగగా, కొన్నాళ్ల క్రితం భద్రాచలం వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ సస్పెన్షన్‌కు గురయ్యారు. వ్యవసాయ శాఖ పంట నమోదు ఆధారంగా సీసీఐ పత్తి కొనుగోళ్లు నిర్వహించాలని నిర్ణయించినా, ప్రక్రియ పూర్తికాకపోవడంతో వ్యవసాయ శాఖ ఉద్యోగులకు తాత్కాలిక రిజిస్ట్రేషన్(టీఆర్)కు అవకావం కల్పించారు. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు క్వింటాకు రూ.5వేల నుంచి రూ.6వేల చొప్పున పత్తి కొనుగోలు చేసి, ఉద్యోగుల సహకారంతో టీఆర్ తీసుకుని రూ.7,521 చొప్పున సీసీఐ కేంద్రాల్లో అమ్మారు. ఈ విషయమై విచారణలో భాగంగా మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్కెటింగ్ శాఖలో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. అయితే, టీఆర్ పుస్తకాల వివరాలు సమర్పించేందుకు అధికారులకు రెండు రోజుల సమయం ఇచ్చినట్లు తెలిసింది.

## సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న ఎస్ఈ శ్రీనివాసాచారి

**ఖమ్మంవ్యవసాయం:** విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించామని ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. శాఖ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన ఫోన్ ఇన్‌లో పలువురు సమస్యలను విన్నవించగా ఆయన మాట్లాడారు. విద్యుత్ అంతరాయాలు, విద్యుత్ బిల్లులు హెచ్చుతగ్గులు, లో ఓల్టేజీ సమస్యల తీవ్రత ఆధారంగా కొన్నింటికి వెంటనే, ఇంకొన్ని రెండు, మూడు రోజుల్లో పరిష్కరిస్తున్నామని తెలిపారు. వినియోగదారులు కంట్రోల్ రూం నంబర్‌కు 94408 11525 ఫోన్ చేయొచ్చని లేదా 1912, 1800 425 0028 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. డీఈలు నంబూరి రామారావు, సీహెచ్.నాగేశ్వరరావు, ఎల్.రాములు, బి.శ్రీనివాసరావు, చిన బాబూరావు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీధర్ పాల్గొన్నారు.

### చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోళ్లు



గోదాంలో పరిశీలిస్తున్న చైర్మన్, అధికారులు

**మధిర:** రైతులు ఇబ్బంది పడకుండా చివరి గింజ వరకు నిరంతరాయంగా ధాన్యం కొనుగోళ్లు చేస్తామని మధిర మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు తెలిపారు. డీఎస్‌ఓ చందన్‌కుమార్‌తో కలిసి మంగళవారం ఆయన ధాన్యం నిల్వ కోసం ఇల్లందులపాడులో గోదాంను పరిశీలించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ మధిర, బోనకల్, ఎర్రుపాలెం మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపడుతూ త్వరగా మిల్లులకు తరలించాలని డీఎస్‌ఓను కోరారు. సివిల్ సప్లయీస్ డీటీ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రానైట్ ఫ్యాక్టరీ కార్మికుడి బలవన్మరణం

**తిరుమలాయపాలెం:** గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఓ కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అసోం రాష్ట్రంలోని నాగోల్ జిల్లా లాల్‌మట్టికి చెందిన రాజుబాసు మాటరి(19) కొక్కిరేణి సమీపాన గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఫోన్ పగులగొట్టిన ఆయన ఆందోళనకు గురయ్యాడు. ఈక్రమంలోనే ఫ్యాక్టరీ సమీపాన చెట్టుకు సోమవారం రాత్రి ఉరి వేసుకున్నాడు. మంగళవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన సహచర కార్మికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### మహిళ అదృశ్యం

**దమ్మపేట:** ఓ మహిళ కనిపించకుండా పోయిన ఘటన మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన గొర్రెముచ్చు శిరీష (26).. తన భర్త చనిపోవడంతో మండలంలోని మొద్దులగూడెంలోని పుట్టింట్లో ఉంటోంది. గతేడాది నవంబర్ 16న ఇంటి నుంచి సొంత పని మీద బయటకు వెళ్లిన శిరీష ఇప్పటివరకు తిరిగి రాలేదు. తల్లితండ్రులు పలుచోట్ల వెతకగా ఆచూకీ లభించలేదు. శిరీష తల్లి నిర్మల మంగళవారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

### ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

**ఖమ్మం రూరల్:** మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి చిన్న వెంకటగిరి వాసి మంగళవారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పి.వీరబాబు(38) యజమాని సూచనలతో మిర్యాలగూడ వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. దీంతో ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలనే డిమాండ్‌తో వీరబాబు మృతదేహంతో యజమాని ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. ఈమేరకు యజమాని మలపూ కృష్ణ ఇంటికి తాళం వేసి వెళ్లిపోగా పోలీసులను ఆశ్రయించారు.

### రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

**చింతకాని:** చింతకాని మండలం రామకృష్ణాపురం బస్టాండ్ వద్ద మంగళవారం చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ముదిగొండ మండలం పెద్దమండవ మున్నేరు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు తేలడంతో సీజ్ చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

### వడదెబ్బతో వృద్ధుడు మృతి



ఎర్రముత్తయ్య (ఫైల్)

**తల్లాడ:** మండలంలోని మల్లవరంలో మంగళవారం వడదెబ్బ బారిన పడిన వృద్ధుడు మృతి చెందాడు. దళిత కాలనీకి చెందిన మేడి ఎర్రముత్తయ్య(76) వైరా రిజర్వాయర్ సమీపంలో ఊట వాగు వద్ద పొలంలో వరి సాగు చేశాడు. ధాన్యం కోతల కోసం పొలానికి వెళ్లి వచ్చిన ఆయన వడదెబ్బ బారిన పడగా ఆస్పత్రిలో చేర్పించారు. ఆయన పరిస్థితి విషమించటంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

**బాజుమల్లాయిగూడెంలో మహిళ...**

**కారేపల్లి:** చేను పనులకు వెళ్లిన మహిళ వడదెబ్బ బారిన పడడంతో మృతి చెందింది. మండలంలోని బాజుమల్లాయిగూడెంకు చెందిన అర్వపల్లి దేవేంద్ర (48) రోజు లాగే సోమవారం చేను పనులకు వెళ్లగా ఎండదెబ్బ తాకడంతో వాంతులయ్యాయి. స్థానికంగా వైద్యం చేయిస్తుండడంతో సోమవారం రాత్రి మృతి చెందింది. ఆమెకు భర్త శ్రీను, ఇద్దరు కుమార్తెలు ఉండగా, చిన్న కుమార్తె వివాహం మే 9వ తేదీన జరగాల్సి ఉండగా కుటుంబంలో విషాదం నెలకొంది.

### డీజే బాక్స్ తలపై పడడంతో మృతి

**వేంసూరు:** రోడ్డు ప్రమాదాలో ఓ యువకుడు మృతి చెందాడు. వేంసూరు మండలంలో కొండెగట్లలో జరిగే వేడుకకు వ్యాన్‌లో మంగళవారం సత్తుపల్లి మండలం గంగారం నుంచి డీజే బాక్స్‌తో నిర్వాహకులు బయలుదేరారు.మర్లపాడు శివారు మూలమలుపు వద్ద వ్యాన్ అదుపు తప్పిబోల్తా పడగా, తిరుపతి విజయ్(17) తలపై డీజే బాక్స్ పడింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందగా, వ్యాన్‌లో ఉన్న గుంజ అజయ్, బొమ్మెర సాయివర్ధన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కాగా, తిరుపతి విజయ్ పదో తరగతి పరీక్షలు రాయగా, ఉపాధి కోసం డీజే కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈమేరకు ఘటనపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరప్రసాద్ తెలిపారు.